ఖిలావరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతలు, నెక్కొండ: పోలీసుల అదుపులో ఉన్న నాయకులు, వర్ధన్నపేట: బీఆర్ఎస్ శ్రేణులను స్టేషన్‌కు తరలించిన పోలీసులు, సంగెం: అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు

ఎక్కడికక్కడ అరెస్టులు

- బీఆర్ఎస్ నాయకులను పోలీస్‌స్టేషన్లకు తరలింపు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడిన పార్టీ శ్రేణులు
- గొంతు నొక్కుతున్న 'హస్తం' సర్కార్
- ఉద్యమకారుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ మరుపల్ల రవి
- ముందస్తు అరెస్టులపై ఆగ్రహం

రాయపర్తి: అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు

ఖిలావరంగల్, సెప్టెంబర్ 13: మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం జిల్లా నుంచి బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌కు వెళ్లకుండా పోలీసులు ఎక్కడికక్కడే అరెస్ట్ చేశారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై పార్టీ నేతలు మండిపడ్డారు. ప్రశ్నించే గొంతులను నొక్కి వేస్తున్నదని ధ్వజమెత్తారు. ఇందులో భాగంగా వరంగల్ మిల్స్‌కాలనీ పోలీసులు ముందస్తుగా వరంగల్‌లోని బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్, వరంగల్ 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నేతల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు గూండాలుగా మారి రౌడీయిజం చేస్తున్నారని విమర్శించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తన అనుచరులతో దాడి చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. చట్ట సభల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అకారణంగా అరెస్టు చేసి గంటల తరబడి బస్సుల్లో తిప్పి సంబంధం లేని పోలీస్‌స్టేషన్లకు తరలించడం పోలీసులకే చెల్లిందన్నారు. అరెస్టయిన వారిలో 34వ డివిజన్ కార్పొరేటర్ కుమారస్వామి, బీఆర్ఎస్ నాయకులు పూజారి విజయ్, వనం కుమార్, గజ్జి సాంబయ్య, పోలెపాక మల్లేశం ఉన్నారు.

నాయకుల ముందస్తు అరెస్ట్

నెక్కొండ/వర్ధన్నపేట/సంగెం/ఖానాపురం: నెక్కొండకు చెందిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. నెక్కొండ పట్టణ అధ్యక్షుడు కొణిజేటి భిక్షపతి, మాజీ వార్డు మెంబర్ తోట సాంబయ్య, బండారి రమేశ్, బోనాల హరీశ్, పట్టణ యూత్ అధ్యక్షుడు బొడ్డుపెల్లి రాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జి మహ్మద్ ఖలీల్ తదితరులు ఉన్నారు. శుక్రవారం తెల్లవారుజామున బీఆర్ఎస్ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు తూళ్ల కుమార స్వామి, జిల్లా నాయకుడు సిలువేరు కుమార స్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, ఇతర ముఖ్య నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని నాయకులు హెచ్చరించారు. శ్రీధర్, ఎల్ల స్వామి, శ్రీరాములు, పిట్టల రాజుతోపాటు పట్టణానికి చెందిన పలువురు నేతలను పోలీసులు సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. సంగెంలో అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, మునుకుంట్ల చంద్రశేఖర్, సంగెం మాజీ సర్పంచ్ బాబు, ఉప సర్పంచ్ కక్కెర్ల శరత్, మెట్టుపెల్లి కొమురయ్య, కత్తి రమేశ్, ఆంజనేయులు, పురుషోత్తం, ఇమ్మడి సుమన్ ఉన్నారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ ప్రజాపాలన ముసుగులో సీఎం రేవంత్‌రెడ్డి నియంత పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. ఖానాపురంలో ఎస్సై రఘుపతి ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, అజహర్, అశోక్, వడ్డే రాజశేఖర్, రాజు, శ్రీనివాస్, మైనోద్దీన్, అశోక్, యాలాద్రి, రాజేంద్రప్రసాద్ తదితరులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు భయానక వాతావరణం సృష్టించి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదంతా బీఆర్ఎస్‌ను అణగదొక్కాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం చేయిస్తున్నదని ధ్వజమెత్తారు.

ఖానాపురం: బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు, గీసుగొండ: పోలీస్‌స్టేషన్‌లో.., చెన్నారావుపేటలో..

ప్రజలే బుద్ధి చెబుతారు..

గీసుగొండ/చెన్నారావుపేట/రాయపర్తి/నల్లబెల్లి/గిర్మాజీపేట/మట్టెవాడ/పర్వతగిరి/దుగ్గొండి: కాంగ్రెస్ నాయకుల గుండాగిరికి ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు శిరిశె శ్రీకాంత్ హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులను గీసుగొండ పోలీసులు గురువారం రాత్రి ముందస్తు అరెస్టు చేసి శుక్రవారం మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. చెన్నారావుపేటలో మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు రఫీ, కుసుమ నరేందర్, మల్లయ్య, కడగండ్ల యాకయ్య, మూడు రమేశ్, బోడ మురళీనాయక్ తదితరులను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

రాయపర్తిలో అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, ఆకుల సురేందర్‌రావు, పూస మధు, ఎండీ నయీం, నర్సయ్య, రాంచందర్, కిషన్‌నాయక్, సుధాకర్, ఆశ్రఫ్‌పాషా, చందురాం, యాకయ్య, రవి, జంపి ఉన్నారు. నల్లబెల్లిలో అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్ నానె బోయిన రాజారాం, నాయకులు పాండవుల రాంబాబు, గుమ్మడి వేణు, పరికి కోర్నేల్, గోనెల నరహరి, తంగెళ్ల వేణు, కార్యకర్తలు ఉన్నారు. ఇంతెజార్‌గంజ్ పోలీసులు పులి అనిల్‌కుమార్, నర్ర సత్యనారాయణ, చెన్నూరి నటరాజు, సోమరాజు విజయ్‌భరత్ తదితరులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. రేవంత్ సర్కార్ రాక్షస పాలన కొనసాగిస్తున్నదని బీఆర్ఎస్ 29 డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్ ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని ఖండిస్తూ శాంతియుతంగా నిరసన చేపట్టగా ముందస్తుగా అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. అరెస్టయిన వారిలో సదాంత్‌తోపాటు, మైనార్టీ నాయకుడు మహ్మద్ షఫీ, తాళ్లపల్లి రమేశ్, డివిజన్ కో ఆర్డినేటర్ సీతారాం, నక్క వివేక్, మార్త కిరణ్, ఎండీ జావిద్ ఉన్నారు. పర్వతగిరిలో అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌గౌడ్, మండల నాయకులు చింతపట్ల సోమేశ్వర్‌రావు, లూనావత్ పంతులు, యాకయ్య తదితరులు ఉన్నారు. దుగ్గొండిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావుతో పాటు పలువురు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

నల్లబెల్లి: పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, గిర్మాజీపేట: ఇంతెజార్‌గంజ్ పోలీసుల అదుపులో ఉన్న నాయకులు, మట్టెవాడ: అరెస్టయిన బీఆర్ఎస్ నేతలు, పర్వతగిరిలో, దుగ్గొండి: స్టేషన్ ఆవరణలో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తండావాసులను విచారిస్తున్న డీఈవో జ్ఞానేశ్వర్

పత్తాలేని ఉపాధ్యాయులు..

కానరాని విద్యార్థులు

- స్కూల్‌కు రాకుండానే జీతాలు తీసుకుంటున్న వైనం
- డీఈవో ఆకస్మిక తనిఖీల్లో విస్తుపోయే నిజాలు
- చర్యలు తీసుకునే యోచనలో జిల్లా విద్యాశాఖాధికారి

నెక్కొండ, సెప్టెంబర్ 13 : ఆ పాఠశాలల్లో విద్యార్థులు లేరు.. బడి తెరుచుకున్న పాపాన పోలేదు. మధ్యాహ్నం భోజనం వండి వడ్డించిన దాఖలాలు లేవు. అయినా నిధులు డ్రా చేస్తూ తాము రెగ్యులర్‌గా పాఠశాలకు వెళ్తున్నట్లు విద్యాశాఖ యంత్రాంగాన్ని నమ్మిస్తున్నారు పలువురు ఉపాధ్యాయులు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని గొట్లకొండ, అజ్మీరా మంగ్యాతండా, రెడ్లవాడ ప్రాథమిక పాఠశాలలు, రెడ్లవాడ హైస్కూల్‌ను శుక్రవారం డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేయడంతో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. డీఈవో జ్ఞానేశ్వర్ మండలంలోని అజ్మీరా మంగ్యాతండా ప్రాథమిక పాఠశాల తనిఖీలో ఇప్పటి వరకు తెరుచుకున్న దాఖలాలు లేవు. పాఠశాల తరగతి గదులు, ఆవరణ అంతా అపరిశుభ్రంగా ఉంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు కానరాలేదు. గ్రామస్తులను విచారిస్తే ఉపాధ్యాయుడు ఏ ప్రవీణ్‌కుమార్ పాఠశాలకు రావడంలేదని, దీంతో విద్యార్థులను ప్రైవేట్ స్కూల్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. అయితే ఇక్కడ పాఠశాల నిర్వహిస్తున్నట్లు,మధ్యాహ్న భోజనం వండిపెడుతున్నట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. గొట్లకొండ తండా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సంధ్యారాణి అనే ఉపాధ్యాయురాలు విధులకు గైర్హాజరయ్యారు. పది రోజుల నుంచి రావడం లేదని తేలింది. గ్రామస్తులను విచారిస్తే రెండు మూడు రోజులకోసారి వచ్చి గంటసేపు కూర్చుని వెళ్లిపోతారని డీఈవోకు తెలిపారు. పాఠశాలలో భద్రపర్చాల్సిన అడ్మిషన్ రిజిస్టర్ బయటపడేసి ఉంది. పాఠశాల వెలుపల, లోపల చెత్తాచెదారం, దుమ్ము, ధూళి పేరుకుపోయింది. పాఠశాల తాళం తెరిచి చాలా రోజులైనట్లు డీఈవో గుర్తించారు. రెడ్లవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనిఖీలో హిందీ ఉపాధ్యాయుడు కె శ్రీధర్ గత పాఠశాలలో వాడుకున్న సెలవులు తక్కువగా నమోదు చేయించుకొని ఇక్కడ ఎక్కువ తీసుకున్నట్లు ఎల్‌పీసీలో గుర్తించారు. పాఠశాలల తనిఖీ అనంతరం నెక్కొండ మండల విద్యావనరుల కేంద్రాన్ని డీఈవో సందర్శించారు. అజ్మీరా మంగ్యాతండా, గొట్లకొండ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేనప్పటికీ వారు హాజరైనట్లు నెలవారీగా బిల్లులు సమర్పించినట్లు గుర్తించారు. అధికారులను తప్పుదోవపట్టిస్తూ మధ్యాహ్న భోజన సరుకులు, బిల్లులను దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించారు. అజ్మీరా మంగ్యాతండా ఉపాధ్యాయుడు ఏ ప్రవీణ్‌కుమార్, గొట్లకొండ పాఠశాల ఉపాధ్యాయురాలు డీ సంధ్యారాణిపై శాఖాపరమైన చర్యలకు తగు ప్రాధికారిక అనుమతిని డీఈవో జారీచేశారు.

ఇన్‌చార్జి ఏవో బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న శశికాంత్

నల్లబెల్లి, సెప్టెంబర్ 13: ఇన్‌చార్జి ఏవో శశికాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఏవో పరమేశ్వర్ బదిలీపై ములుగు జిల్లాకేంద్రానికి వెళ్లారు. ఆయన స్థానంలో ఇటీవల రజిత విధుల్లో చేరారు. ఈ క్రమంలో రెండు నెలలపాటు ప్రభుత్వ శిక్షణలో భాగంగా ఆమె పురుగు మందుల టెస్టింగ్ ల్యాబ్‌కు వెళ్లారు. దీంతో శశికాంత్ ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు.

కుంగ్ ఫూ శిక్షణ తరగతులు ప్రారంభం

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 13: వరంగల్ కొత్తవాడ, ఆటోనగర్‌లోని ప్రభుత్వ గిర్మాజీపేట ఉన్నత పాఠశాలలో మాస్టర్ రొడ్డబోయిన కోటేశ్వర్ ఆధ్వర్యంలో రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని చేనేత వర్కింగ్ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని 8, 9 తరగతుల బాలికలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.నాగమణి, పి.బుచ్చిరెడ్డి, వి.సంపత్‌కుమార్, అఫ్సర్, యాకూబ్ పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ సత్య శారద

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 13: వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్య శారద జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి వరంగల్‌లో నిమజ్జన ప్రాంతాలైన చిన్నవడ్డేపల్లి చెరువు, ఉర్సు చెరువు, కోట చెరువు, బెస్తం చెరువును శుక్రవారం పరిశీలించారు. ఈ 16న భక్తుల సౌకర్యార్థం నిమజ్జన ప్రాంతాల్లో బారికేడ్లు, తెప్పలు, హైమాస్ట్ లైటింగ్, తాగునీటి సదుపాయం ఉండేలా చూడాలన్నారు. మున్సిపల్, నీటిపారుదల, విద్యుత్, అగ్నిమాపక, పోలీసు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. సీపీ మాట్లాడుతూ నిమజ్జన ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కావటి కవిత, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ సలీమా, ఉప కమిషనర్ కృష్ణారెడ్డి, ఏసీపీలు నందిరాంనాయక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ సత్య శారద

ఎంజీఎంహెచ్‌కు మైక్ అందజేత

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 13: ఎంజీఎం దవాఖానలోని ఓపీ కేంద్రంలో రోగులకు తగిన సూచనలు చేయడానికి దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం మైక్ సెట్ అందజేసింది. ఎంజీఎం ఓపీ విభాగంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మైక్ సెట్‌ను ఎంజీఎం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి, ఆర్ఎంవో డాక్టర్ కొడెం మురళి ప్రారంభించారు. రూ. 14 వేల విలువైన మైక్ సెట్‌ను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు బొప్పి ఉమారాణి, బి.సునీత, కే స్వర్ణలత, ఎల్.రవీందర్, వాణి, రాజేశ్వరి, రేణుక, బత్తిని రాజు, అంబటి రాజేందర్, బండి చక్రపాణి, అబ్దుల్ షబీర్ పాల్గొన్నారు.

మైక్‌లో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ మురళి

చిన్నారి వైద్యానికి తహసీల్దార్ సాయం

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందించిన దాతలు

ఆర్థిక సాయం అందజేస్తున్న తహసీల్దార్ ఇక్బాల్

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 13: వరంగల్ దేశాయిపేటకు చెందిన ఇజ్జగిరి కార్తీక బ్రెయిన్ టీబీతో బాధపడుతున్నది. ఈ మేరకు 'చిన్న వయస్సులో పెద్ద జబ్బు' శీర్షికన శుక్రవారం నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. చలించిన వరంగల్ తహసీల్దార్ తన వంతు సాయంగా రూ. 10 వేలు, కార్యాలయ సిబ్బంది రూ. 2 వేలను బాలిక కుటుంబ సభ్యులకు అందించారు. మరికొంతమంది దాతలు ఫోన్‌పే ద్వారా ఆర్థిక సాయం పంపించారు. 'నమస్తే' కథనాన్ని వాట్సాప్ స్టేటస్‌లో చూసిన దాతలు వెంటనే తోచిన సాయం అందిస్తున్నారు. అర్షం మధు, కాల్వల అరుణ్, కోడూరు రఘు రూ. 5 వేలు, మార్గం కుమారస్వామి రూ. 3 వేలు, ఎస్.అనిల్‌కుమార్, తిప్పని అశోక్, తహసీల్దార్ అసిస్టెంట్ రూ. వెయ్యి చొప్పున, కొక్కుల రవి, గజ్జెల ఓంకారశాస్త్రి, పాలడుగు సురేందర్, కుందన్ కీర్తి, కంటెం శంకర్, వెలగంటి కన్నయ్య, మతిరెడ్డి విష్ణు, పెండెం పూర్ణచందర్, అబ్బనిపురం అనిల్‌కుమార్, జోగుల రాజయ్య, మేరుగు రంజిత్ రూ. 500 చొప్పున ఫోన్‌పే ద్వారా పంపించారు. చిన్నారి కుటుంబ సభ్యులు నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు.

'సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ'

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 13: నైజాం సర్కార్‌ను తరిమికొట్టి ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను అందించిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ పాలకులు వక్రీకరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 11 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా పోచమ్మమైదాన్‌లో పార్టీ మండల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కార్యదర్శి బుస్సా రవీందర్ అధ్యక్షతన సభ నిర్వహించారు. నైజాం వ్యతిరేక పోరాటంలో నాడు బీజేపీ పాత్ర లేదన్నారు. ఈ నెల 17న విమోచన దినోత్సవం పేరిట బీజేపీ చేపట్టనున్న కార్యక్రమాలు ప్రజలను మభ్యపెట్టడానికేనని ఆయన విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి, సభ్యులు పంజాల రమేశ్, షేక్ భాషామియా, పనాస ప్రసాద్, గన్నారపు రమేశ్, గుండె భద్రి, తాళ్లపల్లి రహేలా, జన్ను రవి, చెన్నబోయిన రవీందర్ పాల్గొన్నారు.

జిల్లాలో నష్ట పరిహారం చెల్లింపు

ఖిలావరంగల్, సెప్టెంబర్ 13: ఇటీవల భారీ వర్షాల వల్ల జరిగిన నష్టానికి పరిహారం చెల్లించినట్లు కలెక్టర్ సత్య శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే బృందాలు ఇచ్చిన నివేదిక ఆధారంగా జిల్లాలో 107 కూలిన ఇళ్లకు రూ. 16,500 చొప్పున రూ. 17,65,500 వారి బ్యాంక్ అకౌంట్లలో జమ చేసినట్లు వెల్లడించారు. రెండో దఫాలో ఇంకా 20 ఇళ్లు, పది పశువులకు నష్టపరిహారం నేరుగా బాధితుల ఖాతాల్లో జమ చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు

పర్వతగిరి, సెప్టెంబర్ 13: మండలంలో శనివారం నుంచి సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో మాలోత్ శంకర్‌నాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏరాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 33 గ్రామాల్లో 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధిహామీ పనులను తనిఖీ చేస్తారన్నారు. సమావేశంలో ఎంపీవో పాక శ్రీనివాస్, ఎస్టీఎం సాయి జ్ఞానేందర్, ఎస్ఆర్పీ చెన్నకేశవులు, ఏపీవో సుశీల్‌కుమార్, ఈసీ రాజు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

ఓటరు జాబితా విడుదల

వర్ధన్నపేట/ఖానాపురం/రాయపర్తి/గీసుగొండ, సెప్టెంబర్ 13: జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఓటరు జాబితా ముసాయిదాను అధికారులు విడుదల చేశారు. గ్రామాల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల వద్ద ప్రదర్శించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో రాజకీయ పార్టీల నేతలు, యువకుల సమక్షంలో కార్యదర్శులు ఓటర్ల జాబితా ముసాయిదాను ప్రకటించారు. సవరణలకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా వర్ధన్నపేట మండలంలో జాబితాను ప్రదర్శించారు. ఖానాపురం మండలంలోని కొత్తూరు జీపీ కార్యాలయ ఆవరణలో ఓటరు జాబితాను కార్యదర్శి స్రవంతి ఆధ్వర్యంలో ప్రదర్శించారు. రాయపర్తి ఎంపీడీవో కార్యాలయంలో వార్డుల వారీగా ఓటరు జాబితాను ప్రదర్శించారు. మండలంలోని 40 జీపీల ఓటరు జాబితాను వార్డుల వారీగా ప్రదర్శించినట్లు ఎంపీడీవో గుగులోత్ కిషన్‌నాయక్ తెలిపారు. సందేహాలు ఉంటే ఈ నెల 16 వరకు తెలియజేయాలన్నారు. గీసుగొండ మండలంలోని అన్ని జీపీల్లో ఓటరు జాబితాను కార్యదర్శులు ప్రదర్శించారు.

వరంగల్ దేశాయిపేట రోడ్డులోని శ్రీనివాస కాలనీలో 156, నర్సంపేటలో 108 రకాల నైవేద్యాలను విఘ్నేశ్వరుడికి సమర్పిస్తున్న భక్తులు

లంబోదరుడికి భక్తిశ్రద్ధలతో విశేష పూజలు

నమస్తేతెలంగాణ, నెట్‌వర్క్: గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా లంబోదరుడికి జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో ప్రజలు విశేష పూజలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా నర్సంపేటలోని పోచమ్మ వీధిలో విఘ్నేశ్వరుడికి 108 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. వరంగల్ దేశాయిపేటరోడ్డులోని శ్రీనివాసకాలనీలో బొజ్జ గణపయ్యకు 156 రకాల ప్రసాదాలు అందించారు. కాశీబుగ్గలోని మణికంఠకాలనీ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బయ్య అశోక్-స్వప్న దంపతుల తరపున 216 కిలోల లడ్డూను నైవేద్యంగా అందించారు. అనంతరం లడ్డూతో శోభాయాత్రను వంద ఫీట్లరోడ్డు నుంచి పోచమ్మ టెంపుల్ మీదుగా కొనసాగించారు. వరంగల్ ఉర్సు కురుమవాడలోని శ్రీవిఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపయ్య ఆకట్టుకుంటున్నాడు. వర్ధన్నపేటతోపాటు ఇల్లంద, కట్రియాల, ల్యాబర్తి, నల్లబెల్లిలో అన్నదానం చేశారు. ఇల్లంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పాలక మండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. హనుమకొండలోని స్వర్ణ విహార్ అపార్ట్‌మెంట్ ఆవరణలో చేపూరి రామారావు చేసిన అష్టావధానం, డాక్టర్ పల్లేరు వీరస్వామి వ్యంగ చలోక్తులతో శ్రోతలను కడుపుబ్బ నవ్వించారు. నల్లబెల్లి బస్టాండ్ సెంటర్ ఆవరణలో గణపతికి భక్తులు పూజలు చేశారు. వరంగల్ మట్టెవాడ బొడ్రాయి వద్ద ఎస్ఎస్‌కే కత్రి సేవా సమాజ్ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చన చేశారు. కాశీబుగ్గ వర్తక సంఘం ఏర్పాటు చేసిన గణపతికి లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, అఖండ ఓంకార దీపాలతో పూజలు చేశారు.

కరీమాబాద్: పూజలు చేస్తున్న మహిళలు

కుక్కలను తప్పించబోయి..

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

చెన్నారావుపేట, సెప్టెంబర్ 13: వీధి కుక్కలను తప్పించబోయి రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడిన ఘటన మండలంలో శుక్రవారం జరిగింది. తిమ్మరాయిన్‌పహాడ్ శివారు చంద్రుతండాకు చెందిన కేలోత్ రవీందర్ వరంగల్‌లో భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి బైక్‌పై వస్తున్న క్రమంలో తిమ్మరాయిన్‌పహాడ్‌లో రోడ్డుపై ఉన్న కుక్కలను తప్పించే క్రమంలో రవీందర్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని అంబులెన్స్‌లో నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

సీతారాం ఏచూరికి సీపీఎం నేతల నివాళి

పోచమ్మమైదాన్/చెన్నారావుపేట/నల్లబెల్లి, సెప్టెంబర్ 13: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటని కాశీబుగ్గ ఏరియా కార్యదర్శి మహ్మద్ బషీర్ అన్నారు. కాశీబుగ్గ జంక్షన్‌లో శుక్రవారం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు వలపుదాసు దుర్గయ్య, యార ప్రశాంత్, దామెర రమేశ్, అడ్డూరి బ్రహ్మం, ప్రభాకర్, పరంజ్యోతి, నరసింహారావు, ప్రశాంత్ పాల్గొన్నారు. చెన్నారావుపేట మండలం పాపయ్యపేటలో అబ్బుదాసి అశోక్ ఆధ్వర్యంలో నాయకులు శ్యామ్, శ్రీను, ప్రవీణ్ నివాళులర్పించారు. నల్లబెల్లిలో ఏచూరి చిత్రపటానికి పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కడియాల వీరాచారి, నాయకులు గాదె మోహన్‌రెడ్డి, బొడిగె సమ్మయ్య, ఈర్ల రవి, లింగయ్య, నారాయణస్వామి, కత్తి సమ్మాలు, కోటి, దామ సాంబయ్య, నాగరాజు, సంజీవ, సాంబయ్య, కేదారి, సుజాతపైడి, సారయ్య నివాళులర్పించారు.

కాశీబుగ్గలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొండ చిలువను పట్టుకున్న రైతులు

కొండ చిలువను క